క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ పోటీలకు వీఎస్‌ఎం విద్యార్థి

రామచంద్రపురం: ఆలిండియా అంతర విశ్వవిద్యాలయం సాఫ్ట్‌బాల్ పోటీలకు వీఎస్‌ఎం కళాశాల విద్యార్థి ఐ.ప్రవీణ్‌కుమార్ ఎంపికైనట్లు పీడీ కె.మనోహర్ స్థానిక విలేకరులకు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రవీణ్ జి.మామిడాడ డీఆర్‌కే కళాశాలలో జరిగిన ఎంపికల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చినట్లు తెలపారు. ఈ నెలాఖరులో చండీఘర్‌లో పంజాబ్ యూనివర్సిటీ పరిధిలో జరిగే పోటీల్లో ప్రవీణ్ పాల్గొంటారని తెలిపారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎస్ మూర్తి తదితరులు ప్రవీణ్‌కు అభినందనలు తెలిపారు.

విద్యోదయ చారిటబుల్ ట్రస్టుకు విరాళం



విద్యోదయ చారిటబుల్ ట్రస్టు చైర్మన్‌కు విరాళం అందిస్తున్న జీవీ రావు, విద్యార్థులు

రామచంద్రపురం: సామాజిక సేవలు తమ వంతు పాత్ర పోషిస్తున్న పట్టణానికి చెందిన విద్యోదయ చారిటబుల్ ట్రస్టుకు తమ వంతు విరాళాన్ని అందిస్తున్నట్లు మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీ రావు తెలిపారు. ఈ సందర్భంగా గత రెండు నెలలుగా యూఎస్ఎఫ్ బాక్సుల ద్వారా వితరణ చేసిన రూ.7,420లను ట్రస్టు చైర్మన్ పి.రాంబాబుకు విద్యార్థుల చేతుల మీదుగా అందించారు. గత నాలుగు సంవత్సరాలుగా విద్యోదయ చారిటబుల్ ట్రస్టు పేద విద్యార్థులకు చేస్తున్న సేవలకు స్పందించి ఈ విరాళం సహాయాన్ని అందజేశామన్నారు. మోడరన్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడ్కో గృహ పత్రాల పంపిణీ



టిడ్కో గృహ పత్రాలను అందిస్తున్న కౌన్సిలర్లు

రామచంద్రపురం: పట్టణంలోని కొత్తూరులో నిర్మించిన టిడ్కో గృహాల పత్రాలను 12, 13 వార్డు లబ్ధిదారులకు కౌన్సిలర్‌లు నల్లా అంజమ్మ, కేతాశ్రీను, కోఆప్షన్ సభ్యులు ఎస్‌కేఎంకే మస్తాన్ అందజేశారు. సచివాలయంలో అడ్మిన్ స్వాతి ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు వీటిని అందించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో టిడ్కో గృహాలను తయారు చేసి లబ్ధిదారులకు అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ సాయంతో గృహాలు నిర్మించుకోవాలి



హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి

కపిలేశ్వరపురం: జగనన్న కాలనీల్లో స్థలాలు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సాయంతో గృహాలు నిర్మించుకునేందుకు ముందుకు రావాలని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని టేకి గ్రామంలో మంగళవారం ఆయన లబ్ధిదారులతో సమావేశమయ్యారు. హౌసింగ్ ఏఈ పీవీవీఎస్ఎన్‌మూర్తి లబ్ధిదారుల వివరాలను, కాలనీల్లో ఇళ్ల నిర్మాణ స్థితిగతులను వివరించారు. ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, క్షేత్రస్థాయి అధికారులు ఆ దిశగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఆదేశించారు.

రైల్వే ఫ్లైఓవర్ నిర్మించాలంటూ బీజేపీ నిరసన

మండపేట: మండలంలోని కేశవరం రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రైల్వేగేటు వద్ద బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. తరచూ రైల్వేగేట్ వద్ద ట్రాఫిక్ జామై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని, కేంద్ర నిధులకు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు మంజూరు చేయాలని కోరారు. బీజేపీ మండల కన్వీనర్ రాయి వీర్రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి చిట్టిబాబు, వల్లభనేని రవీంద్రబాబు, మద్దుల సుబ్బారావు, కేవీవీ సాయిరాం, చాట్రాతి జానకి రాంబాబు, సూరంపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాచరలో పారిశుధ్య పనులు

కపిలేశ్వరపురం: మండలంలోని మాచర గ్రామంలో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలో పారిశుధ్య కార్మికులు ముగ్గు చల్లారు. డ్రెయిన్లలో దోమల నివారణ మందును పిచికారీ చేశారు. సర్పంచ్ వాసంశెట్టి సునీత, కార్యదర్శి చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి విష్ణులు పారిశుధ్య చర్యలను పర్యవేక్షించారు.

ఆహారంపైనా దృష్టి ఉండాలి



విద్యార్థి తీసుకునే ఆహారం మనస్సుపైన, శరీరంపైనా ప్రభావితమవుతుంది. పరీక్షల సమయంలో మానసికంగానూ, శారీరకంగానూ ఆరోగ్యంగా ఉండడం అవసరం. పోషక విలువల గల ఆహారాన్ని సమపాళ్లలో తీసుకోవాలి. రోజూ ఒక పండు, వారంలో రెండు రోజులు ఆకు కూరలు విధిగా ఉండేలా చూసుకోవాలి. పరీక్షలు అయ్యే వరకూ సాత్వికాహారాన్ని తీసుకోవడం మంచిది.

–డాక్టజుప అడపా మహీజ, సుందరపల్లి, కె.గంగవరం మండలం

తగినంత నిద్ర తప్పనిసరి



శరీరం, మనస్సు ఒక దానికొకటి అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. పరీక్షలంటేనే రాత్రి తెల్లవార్లూ చదువు కోవడమనే ఆలోచన అశాస్త్రీయం. ఎంత సమయం చదివామన్న దానికంటే మెదడులో నిక్షిప్తమయ్యే నాణ్యతతో ఎంతసేపు చదివామన్నది చాలా ముఖ్యం. చదవడంతో పాటు రోజుకు కనీసం ఆరు గంటల నిద్ర అవసరమని గుర్తించాలి.

–డాక్టర్ చిట్టూరి రాకేష్ చౌదరి, వాకతిప్ప పీహెచ్‌సీ

ఆరోగ్య సమస్యలను అశ్రద్ధ చేయొద్దు



జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, అజీర్తి లాంటి చిన్న సమస్యలే. పెద్ద ఆరోగ్య సమస్యలు సైతం చిన్నపాటి లక్షణాలతోనే ప్రారంభం అవుతుంటాయి. విద్యార్థి అలాంటి వాటిని గమనించిన చిన్నపాటి ఆరోగ్య సమస్యలను కూడా అశ్రద్ధ చేయకూడదు. వెంటనే వైద్యుడిని సంప్రదించడం వల్ల ఆరోగ్య సమస్య పరిష్కారమై పరీక్షలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి.

– డా.చల్లా రవికుమార్, హోమియో వైద్యుడు, మండపేట

ఆరోగ్యానికి పరీక్ష కారాదు

- ఎగ్జామ్స్ వేళ ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం
- ఏప్రిల్ 03 నుంచి పది, మార్చి 15 నుంచి ఇంటర్ పరీక్షలు
- విద్యార్థులకు తగినంత నిద్ర, పోషకాహారం తప్పనిసరి
- ప్రమాదాలకు దూరంగానూ ఉండాలి
- వైద్యులు, సామాజికవేత్తల సూచనలు



వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠం వింటున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: పోటీ ప్రపంచంలో చదువులు సైతం ప్రభావితమవుతున్నాయి. సమాజంలో ఎదగాలంటే చదువులో ఉన్నతంగా ఉండాలన్నది సామాజిక నియమమైపోయింది. ఏడాదిపాటు విన్నవి, చదువుకున్నవాటికి అక్షర రూపం ఇవ్వడమే పరీక్షల ప్రక్రియను శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలి. ఒత్తిళ్లు, ఆందోళనలకు దూరంగా ఉండడంతో పాటు పాఠ్యాంశాల్లోని కీలకాంశాలను పట్టుకుని సమాధాన పత్రంలో చక్కగా అమర్చాల్సిందే. ఏప్రిల్ 3 నుంచి పది, మార్చి 15 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు వైద్యులు, సామాజిక కార్యకర్తలు చేసిన సూచనలపై ఈ కథనం..

పరీక్షలు రాసే విద్యార్థులిలా...

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 64 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 4,494 మంది, ప్రైవేట్ పాఠశాల్లో సుమారు 1500 మంది ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. అలాగే 14 జూనియర్ కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు మార్చి 15న నుంచి ఇంటర్ పరీక్షలు రాయనున్నారు.

రోడ్లపై జాగ్రత్తగా ఉండాలి



ప్రమాదాలతో పరీక్షలపై ప్రభావం పడుతుంది. వయసు రీత్యా పది, ఇంటర్ విద్యార్థులకు బైక్‌లు నడిపే అర్హత ఉండదు. వారు వాహనాలపై పరీక్షలకు వెళ్లడం సరికాదు. పరీక్ష సమయానికి ముందుగా సెంటర్‌కు చేరుకోవాలి.

– చంటి, ఎస్సై, అంగర

మూడు లీటర్ల నీరు తాగాలి



తగినంత నీరు తాగనందున తలనొప్పి, వికారం, నీరసం వచ్చి ఏకాగ్రతకు సమస్యలొస్తాయి. నీటితో శరీర అంతర్భాగాలు శుద్ధి అయ్యి సమస్యలను మటుమాయం చేస్తాయి. ఆహారంతో పాటు రోజుమొత్తంలో కనీసం మూడు లీటర్ల నీరు తాగాలి. అలా అని ఒకేసారి భారమయ్యే పద్ధతిలో తాగకూడదు. ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ నీటిని తాగాలి. భోజనం, ఆహారం తీసుకోడానికి గంట ముందు నీరు తాగరాదు.

–డాక్టర్ జి.అనూజ ప్రియాంక, అంగర పీహెచ్‌సీ

వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం



వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో పరీక్షల నిర్వహణ సాగుతుంది. విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే సమీప పీహెచ్‌సీలలోని వైద్యులను సంప్రదించాలి. పరీక్ష కేంద్రాల వద్ద ఏటా వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం.

–కె.తాతారావు, ఎంఈఓ, కపిలేశ్వరపురం

సర్పంచ్‌ల ఆత్మీయ కలయిక



రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సర్పంచ్‌లు

కె.గంగవరం: మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు మంగళవారం ఆత్మీయ కలయిక సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లుగా బాధ్యతలు చేపట్టి నేటితో రెండేళ్లు పూర్తవడంతో మండలంలోని 25 గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. సమావేశంలో వారు మాట్లాడుతూ గడచిన రెండేళ్లలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ప్రతి రోజు పారిశుధ్యం మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన డీసీయంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మార్కెట్ కమిటి చైర్మన్ పండు గోవిందరాజు హాజరయ్యారు. మండల మాజీ కన్వీనర్ ఓబులనేని రాజ్‌కుమార్, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'గడప గడపకూ' సమస్యల పరిష్కారం



డ్రైన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న చైర్ పర్సన్ దుర్గారాణి

మండపేట: క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం దోహద పడుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. స్థానిక 24వ వార్డు పుంతరోడ్డులో సచివాలయ నిధులు రూ.13 లక్షలతో చేపట్టిన డ్రైన్ నిర్మాణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. అనంతరం చైర్ పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ గడప గడపకూ పర్యటనలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వార్డులో పర్యటించినపుడు స్థానికులు డ్రైన్ సమస్యను వివరించారన్నారు. వెంటనే స్పందించి డ్రైన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ తోట అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు జొన్నపల్లి సత్తిబాబు, ఏఈ కేవీవీ సత్యనారాయణ, సచివాలయ సెక్రెటరీ రిషీ, అంధనాపల్లి రవి, బత్తిన దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రాస్‌బండ్‌లు ఏర్పాటు చేయాలి

కాజులూరు: మండల గ్రామాల్లో డ్రెయిన్లకు క్రాస్ బండలు (అడ్డుకట్టలు) ఏర్పాటు చేసి శివారు భూములకు సాగు నీరందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కాజులూరుకు చెందిన రైతు సంఘం నాయకులు తలాటం వీరన్న తదితర రైతులు కోరుతున్నారు. గోదావరిలో నీటి నిల్వలు తగ్గటంతో కాలువలకు సాగునీటి సరఫరా తగ్గి తూర్పుడెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్న కాజులూరు మండల గ్రామాలకు తీవ్ర సాగు నీటి ఎద్దడి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో అధికారులు డ్రెయిన్లకు క్రాస్‌బండ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా వృథాగా బయటకు పోవు నీటిని రైతులు ఆయిల్ ఇంజిన్లతో పొలాలకు తోడుకునేందుకు అవకాశం ఉంటుందని ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సైకిల్ తొక్కండి ఆరోగ్యం మెరుగుపరచుకోండి



వెల్లలో సైకిల్ ర్యాలీ చేస్తున్న డాక్టర్ మమత, సిబ్బంది

రామచంద్రపురం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు మండలంలోని వెల్ల, ద్రాక్షారామ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో మంగళవారం మెగా సైకిల్ థాన్ ఈవెంట్‌లో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. సైకిల్ తొక్కండి ఆరోగ్యం మెరుగుపరుచుకోండి, ప్రకృతిని కాపాడండి నినాదంతో నిర్వహించిన సైకిల్ ర్యాలీ గ్రామస్తులలో ఆలోచన రేకెత్తించింది. పీహెచ్‌సీలకు అనుబంధంగా ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల వద్ద కూడా సైకిల్ ర్యాలీ, హెల్త్ మేళాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మమత మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వల్ల రోగ నిరోధక వ్యవస్థ బలపడి, ఒత్తిడిని దూరం చేస్తుందని, గుండె, ఊపిరితిత్తుల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. గాఢ నిద్ర పట్టడంతో మానసిక ఆరోగ్యం మెరుగుపడి, కండరాలు బలపడతాయన్నారు. మోటారు వాహనాల వాడకం తగ్గించి సైకిల్ తొక్కడం వల్ల వాయు కాలుష్యం తగ్గించి ప్రకృతికి మేలు చేసినవారవుతామన్నారు. ద్రాక్షారామలో డాక్టర్ సందీప్‌నాయుడు, వెల్ల, ద్రాక్షారామ పీహెచ్‌సీల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అంగరలో సైక్లింగ్ చేస్తున్న డాక్టర్ రత్నకుమారి, ఆరోగ్య కార్యకర్తలు

సైక్లింగ్‌తో ఆరోగ్యం

కపిలేశ్వరపురం: రోజువారీ జీవితంలో సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డి రత్నకుమారి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం అంగరలో ఆరోగ్య మేళా నిర్వహించారు. వైద్యాధికారి రత్నకుమారి, ఇతర వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సైకిల్ తొక్కుతూ ప్రయోగాత్మకంగా సైక్లింగ్ ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. సైక్లింగ్‌తో ఊపిరితిత్తులు, గుండె, రోగ నిరోధక వ్యవస్థలను బలోపేతం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్ పి.సురేష్, టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పిలు ఎస్.దేవి, కె.రమాదేవి, ఎల్‌టీ ఎం.ఆలీ పాల్గొన్నారు.

జల్లు స్నానఘట్టం పనుల పరిశీలన



జల్లు స్నానఘట్టం పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

మండపేట: మండలంలోని కేశవరంలో మాదే చెరువు సమీపంలోని ఎస్సీ శ్మశానవాటిక వద్ద చేపట్టిన జల్లు స్నానఘట్టం పనులను మంగళవారం ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ పరిశీలించారు. అంత్యక్రియల అనంతరం స్నానం చేసేందుకు శ్మశానవాటిక వద్ద సరైన వసతి లేకపోవడంతో దళితులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి జల్లు స్నానఘట్టం నిర్మాణానికి నిధుల మంజూరు చేయించారన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ శ్రీనివాసు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు చంద్రమళ్ల పోతురాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గంధం సూరిబాబు, గనిశెట్టి సత్తిబాబు, అరవ సూరిబాబు, ఎలుగుబంటి సుబ్బారావు, ఎడ్ల రవి, పినిపే శేఖర్, చంద్రహాస్, తానంకి రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు ఛిద్రం



ద్రాక్షారామలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వినోద్

రామచంద్రపురం రూరల్: మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు ఛిద్రమవుతాయని ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని ద్రాక్షారామలో మంగళవారం లిటిల్ రోజ్ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎస్సై డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి విద్యార్థులు తమవంతు కృషి చేయాలని కోరారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నా, సరఫరా చేస్తున్నట్లు తెలిసినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డిగ్రీ ప్రిన్సిపాల్ సత్తిరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శర్మ, ప్రోగ్రాం ఆఫీసర్లు జి.వీరబాబు, రవి కిరణ్, వైవీ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ స్వేచ్ఛ'పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అప్పారావు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో మండపేట సబ్ ఇన్‌స్పెక్టర్ కె.అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం 'ఆపరేషన్ స్వేచ్ఛ' బాండెడ్ లేబర్ అబాల్యూషన్ డే నిర్వహించారు. ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై అప్పారావు మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు చిన్నారులు షాపుల్లో, ఇటుక బట్టీల్లో, రైస్ మిల్లుల్లో తదితర చోట్ల పనుల్లో ఉంటే గుర్తించి పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చిన్నారులు ఎవరికైనా చదువుకు ఆటంకం కలిగించే విధంగా పనులకు వెళ్లే పరిస్థితులు వచ్చినా, బాల్య వివాహాలు చేసే పరిస్థితులు వచ్చినా వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి ఫోన్ చేస్తే అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని వివరించారు. కార్యక్రమంలో ఎస్వీ కళాశాల కరస్పాండెంట్ గంగుమళ్ల నాగ సోమేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.సత్యనారాయణ, రామచంద్రపురం ఏఎస్సై నాగార్జున, డీసీపీయూ యూనిట్ ప్రొడక్షన్ ఆఫీసర్ పెయ్యల లక్ష్మి, చైల్డ్ లైన్ అధికారి రాజ్‌కుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ విజయ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

కాజులూరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదటి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆశయాలను నేటి తరం దళిత నాయకులు ఆదర్శంగా తీసుకుని దళితజాతి అభ్యున్నతికి పాటుపడాలని వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు అన్నారు. దామోదరం సంజీవయ్య 102వ జయంతి పురస్కరించుకుని మంగళవారం గ్రామంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గొల్లపాలెం గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక గ్రామానికి చెందిన పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

మండపేట: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో మండపేట మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించాల్సిన మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని వాయిదా వేసినట్టు చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి తెలిపారు. మరలా ఎప్పుడు జరిగేది త్వరలో వెల్లడిస్తామని మంగళవారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వసతులు కల్పించకపోతే ఆందోళన చేస్తా

మండపేట: పట్టణంలోని టిడ్కో ప్లాట్ల వద్ద మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన ప్లాట్లను సందర్శించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వసతుల కల్పన గురించి ఆయన అధికారులను ప్రశ్నించారు. లబ్ధిదారులకు తాగునీరు, విద్యుత్తు తదితర సదుపాయలు పూర్తిగా అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మార్చి నెలాఖరులోగా వారి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామని ఎమ్మెల్యే వేగుళ్ల తెలిపారు. టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు అబ్బులు ఎంపిక

ఆలమూరు: మండలంలోని కలవచర్లకు చెందిన టి.అబ్బులు రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల రాజమహేంద్రవరంలోని వల్లా ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో ఇండియన్ రౌండు రిక్వర్ కాంపౌండ్ విలువిద్య పోటీల్లో పాల్గొని చక్కని ప్రతిభను కనబర్చి గోల్డ్ మెడల్ సాధించాడు. దీంతో ఈనెల 28న విజయవాడలోని చెరుకూరి వల్లా ఆర్చరీ అకాడమీ నందు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా విలువిద్య పోటీల నిర్వహణ అధ్యక్షుడు కేఎస్ఎస్ గోపాలకృష్ణ మంగళవారం విలేకరులకు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగరెడ్డి, తహసీల్దార్ కిశోర్‌బాబు తదితరులు అభినందించారు.

వీర జవాన్లకు అశ్రునివాళి



వీర జవాన్ల త్యాగాలను వివరిస్తున్న వక్తలు

రామచంద్రపురం: పుల్వామా దాడిలో వీరమరణం పొందిన సైనికుల త్యాగం వృథా కాకుండా ప్రతి ఒక్కరూ దేశ భక్తిని కలిగి ఉండాలని పలువక్తలు అన్నారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ విద్యా సంస్థల ప్రాంగణంలో మంగళవారం 2019 ఫిబ్రవరి 14న సైనికులపై పుల్వామా వద్ద జరిగిన ఆత్మాహుతి దాడిలో 40 మంది జవానులు అమరులైన సందర్భంగా వారి త్యాగానికి ప్రతీకగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సిబ్బంది వారి పవిత్రఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించి నివాళులర్పించారు. మాజీ సైనికుడు దిగుతాడి భూషణం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత, వైస్ ప్రిన్సిపాల్ వై పద్మజ, హెచ్ఓడి హిందీ పండిట్ ఎస్వీ రమణ, జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అడ్వైజరీ బోర్డు డైరెక్టర్ కంచుమర్తి బాబూరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. దేశానికి సైనికులు రైతులు వెన్నెముక అని వారు చేసే మేలు మరువలేమన్నారు. విద్యార్థులు దేశ భక్తిని కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కె.గంగవరంలో..



అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కె.గంగవరం: మండలంలోని అముజూరులో హారికా పబ్లిక్ స్కూల్ వద్ద మంగళవారం సీఆర్‌పీఎఫ్ జవాన్లకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళులు అర్పించారు. పుల్వామా ఉగ్రవాది దాడిలో అమరులైన 40 మంది సైనికుల కుటుంబాలకు వారు ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్కూల్ డైరెక్టర్ ఏవీ రమణమూర్తి మాట్లాడుతూ సైనికులను ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి దేశం కోసం జీవితకాలంలో ఎంతోకొంత కాలం సైన్యంలో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, లక్ష్మీప్రసన్న, రోహిణి, హెచ్ఎం నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వరాహాల పందెం నిర్వాహకులపై కేసు

అయినవిల్లి: మండలంలోని క్రాపలో పందుల పందెం నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన బండి ఏసు, బండి మణి రక్షణ ఆనంద్, గుత్తుల మీరయ్యలు పందుల పందెం ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై పందెం నిర్వహణ స్థలానికి తన సిబ్బంది వెళ్లి పందెం నిర్వాహణను నిలుపుదల చేశారు. నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.